క్లుప్తంగా

ఘనంగా బంగారమ్మతల్లి పరస


బంగారమ్మతల్లి

పెందుర్తి: మండలంలోని గొరపల్లి పంచాయతీ గంగమ్మపేటలో వెలసిన గ్రామదేవత బంగారమ్మతల్లి మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచి బంగారమ్మతల్లికి అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు పసుపు-కుంకుమలు, చీరలు సమర్పించారు. భజన చెక్కను ఊరేగించారు. చిన్నారులు రంగురాట్నాలు ఎక్కి సంబరపడ్డారు. శుక్రవారం రెండోరోజు పరస జరుగుతుంది. పరసకు గొరపల్లి, గంగమ్మపేట, కోట్నివానిపాలెం, కరకవానిపాలెం, గవరపాలెం, గొల్లలపాలెం తదితర గ్రామాలతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు.

వెంకన్న ఆలయంలో పండిత సదస్సు


సదస్సులో పాల్గొన్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలోని కొండదిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పండిత సదస్సు విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి శేషతల్పంపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. స్వామివారి వైభవాన్ని పండితులంతా కీర్తించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సదస్సులో పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి, రాజీవ్ లోచన్, శ్రీకాంత్, భార్గవ్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ట్యుటోరియల్ పూర్వ విద్యార్థులు

పెందుర్తి: నగరంలోని నేషనల్ తెలుగు ట్యుటోరియల్ కళాశాల పూర్వ విద్యార్థులు మానవత్వం చాటుకున్నారు. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన క్యాన్సర్ బాధితుడు హర్షవర్ధన్‌కు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విలేకరి ఈశ్వర్‌కు రూ.5 వేలు, మరో విలేకరి శ్రీధర్ భార్యకు రూ.5 వేలు అందజేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ మార్చాలని వినతి


మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: మండలంలో పి.బోనంగి శివారు వి.ఎల్.ఎన్ పురం గ్రామంలో మరమ్మతులకు గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి వేరే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ సభ్యుడు దెక్క శ్రీనివాసరావు కోరారు. వీఎల్ఎన్‌పురం బోయమాంబ ఆలయ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ కొంత కాలం నుంచి సరిగ్గా పని చేయడం లేదు. నిప్పు రవ్వలు ఎగసి పడుతున్నాయని.. ప్రజలు ఇబ్బందులను గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చడానికి వీలుగా ఏర్పాటు కూడా చేశారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ: తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన మేరిగి రాజన్న వాడచీపురుపల్లిలో మద్యం దుకాణం నుంచి కొనుగోలు చేసి అమ్మకానికి తరలిస్తున్న 25 మద్యం సీసాలను(180 ఎంఎల్) గురువారం స్వాధీనం చేసుకున్నామని సీఐ బాలసూర్యారావు తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

విలీన ప్రాంతాల్లో వెలుగులు

- విస్తృతంగా అభివృద్ధి పనులు
- అర్బన్ హెల్త్ సెంటర్, పార్కులు, రోడ్లు, కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం



పెందుర్తి: జీవీఎంసీ విలీన ప్రాంతాలకు పట్టిన గ్రహణం వీడుతోంది. దాదాపు పుష్కరకాలంగా ఇక్కడి ప్రజలు పడిన వెతల నుంచి బయటపడుతున్నారు. ఐదేళ్ల కిందట వరకు కనీస మౌలిక వసతులు లేక అవస్థలు పడిన విలీన ప్రాంతాల ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మౌలిక వసతులకు నోచుకున్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సారథ్యంలో పెందుర్తి పట్టణ ప్రాంతం అభివృద్ధి వైపు వడివడిగా అడుగులు వేసింది. రోడ్లు, కన్వెన్షన్ సెంటర్లు, పార్కులు, అర్బన్ హెల్ క్లినిక్‌లు ఇలా చెప్పుకుంటూ పోతే విలీన ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులతో నూతన శోభను సంతరించుకున్నాయి.

మోడల్ వార్డుగా అడుగులు

జీవీఎంసీ 95వ వార్డును మోడల్ వార్డుగా అభివృద్ధి


రూ.2 కోట్లతో నిర్మాణంలో ఉన్న కన్వెన్షన్ సెంటర్



పురుషోత్తపురంలోని అర్బన్ హెల్త్ క్లినిక్

చేస్తున్నారు. దీనిలో భాగంగా సింహ భాగం నిధులు విలీన ప్రాంతాల్లో వసతుల కల్పనకే కేటాయించారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. చీమలాపల్లి వద్ద రూ.2 కోట్లతో కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఆ పనులు తుదిదశకు చేరాయి. రత్నగిరి నగర్‌లో స్పోర్ట్స్ థీమ్ పార్కు 1.98 కోట్లతో అభివృద్ధి చేశారు. అతిత్వరలో దీన్ని ప్రారంభించనున్నారు. పాపయ్యరాజుపాలెం-లక్ష్మీపురం రోడ్డును రూ.కోటి నిధులతో అభివృద్ధి చేశారు.

జోరుగా అభివృద్ధి పనులు : జీవీఎంసీ 96వ వార్డులో పెందుర్తి-పులగానిపాలెం రోడ్డును రూ.1.98 కోట్లతో నిర్మించారు. అలాగే బీఆర్‌టీఎస్-సుజాతనగర్ రోడ్డు నిర్మాణం కోసం రూ.3.72 కోట్లు కేటాయించారు. ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జోన్-8 పరిధిలోని 10 పార్కుల అభివృద్ధికి రూ.4.72 కోట్లు నిధులు వచ్చాయి. 6 ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం కోసం రూ.4.10 కోట్లు వెచ్చించారు. వేపగుంట సమీపంలోని కాపు కల్యాణ మండపం రూ.88 లక్షలతో పనులు పూర్తి చేశారు. వాటికి కొనసాగింపుగా..రానున్న రోజుల్లో విలీన ప్రాంతాలకు మరిన్ని నిధులు విడుదల చేసేందుకు జీవీఎంసీ సిద్ధంగా ఉంది.


తుది దశలో ఉన్న రత్నగిరినగర్ స్పోర్ట్స్ థీమ్‌పార్కు

అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



ఎన్నికల సమయంలో ప్రజలకు దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చాం. అవన్నీ నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయి. అత్యధికంగా 95వ వార్డుకు నిధులు కేటాయింపు జరగడం సంతోషంగా ఉంది. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించాం. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కమిషనర్ సహకారంతో నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ విలీన ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాం.

– ముమ్మన దేముడు, కార్పొరేటర్ 95వ వార్డు.


రూ.కోటితో నిర్మించిన పాపయ్యరాజుపాలెం-చీమలాపల్లి రహదారి

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, అధికారులు, భక్తులు


అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రవర్తి, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపరింటెండెంట్లు పిల్లా శ్రీనివాసరావు, సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

మాఘ పౌర్ణమికి ఏర్పాట్లు

- ముస్తాబైన ముత్యాలమ్మపాలెం తీరం
- గజ ఈత గాళ్ల ఏర్పాటు
- స్టీల్ డిపో నుంచి 10 ప్రత్యేక బస్సులు


తీరంలో కొలువుదీరిన మాధవస్వామి

పరవాడ: మాఘపౌర్ణమి పూజలకు ముత్యాలమ్మపాలెం తీరం సిద్ధమైంది. శుక్రవారం వేలాదిగా తరలిరానున్న భక్తుల కోసం మాధవస్వామి ఆలయంతో పాటు తీరంలో విస్తృత ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ సూరాడ సోమునాయుడు చెప్పారు. మాధవస్వామికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇక్కడ జాగరణ చేయడానికి శుక్రవారం రాత్రికే విశాఖ, అనకాపల్లి, గవర్ల అనకాపల్లి, తోటాడ, వెంకటాపురం, పరవాడ, సబ్బవరం, పెదముషిడివాడ, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, స్టీల్ ప్లాంట్, ఎన్టీపీసీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తీరానికి చేరుకుంటారు. రాత్రింతా జాగరణ చేసి శనివారం వేకువ జామున తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తారు. స్నాన ఘట్టాల వద్ద మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తీర్థ మహోత్సవంలో భాగంగా ముత్యాలమ్మపాలెం కూడలి నుంచి తీరం వరకు రోడ్డుకు ఇరువైపులా రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ చేశారు. మాధవస్వామి ఆలయాన్ని విద్యుత్ తోరణాలతో అలంకరించారు. జాగరణ


మాఘ స్నానాలకు సిద్ధమైన ముత్యాలమ్మపాలెం తీరం


విద్యుత్ వెలుగులో మాధవస్వామి ఆలయం

చేసే భక్తుల కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రికి తప్పెటగుళ్లు, సాముగరిడీలు, తోడపెద్దులు, భజనలతో పాటు పల్సర్ బైక్ ఝాన్సీ కార్యక్రమం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని సోమునాయుడు చెప్పారు. మాఘపౌర్ణమి తీర్థమహోత్సవంలో పాల్గొనడానికి విచ్చేస్తున్న భక్తుల కోసం విశాఖ స్టీల్ డిపో శుక్రవారం రాత్రి నుంచి ముత్యాలమ్మపాలెం వరకు 10 ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

కార్లు, ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు ముత్యమాంబ ఆలయం వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 70 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 మంది గజ ఈతగాళ్లను కూడా నియమించినట్టు పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం/పరవాడ: సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయసు 01-07-2023 నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. స్థానిక గ్రామ నివాసుతురాలైన వివాహమైన మహిళలు అవసరమైన ధ్రువపత్రాలతో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నేరుగా గాని రిజిస్టర్ పోస్టులో అయినా పంపించవచ్చునని తెలిపారు.

సబ్బవరం మండంలోని ఖాళీల వివరాలు

పంచాయతీ	అంగన్‌వాడీ పేరు	పోస్టు	రిజర్వేషన్
టెక్కలిపాలెం	నాయనమ్మపాలెం	ఆయా	ఓసీ
అంతకాపల్లి	రావలమ్మపాలెం-2	ఆయా	ఓసీ
నారపాడు	జలిజపాలెం	ఆయా	ఓసీ
వంగలి	వంగలి-2	ఆయా	ఎస్సీ
తవ్వవానిపాలెం	తవ్వవానిపాలెం-2	ఆయా	ఎస్సీ
అమృతపురం	అమృతపురం-2	ఆయా	ఎస్సీ
అమృతపురం	సూరెడ్డిపాలెం	ఆయా	ఓసీ
సబ్బవరం	గణపతిపురం	మినీ అంగన్వాడీ కార్యకర్త	ఓసీ

పరవాడ మండలంలో..

పంచాయతీ	అంగన్‌వాడీపేరు	పోస్టు	రిజర్వేషన్
వాడచీపురుపల్లి	పోలిరెడ్డిపాలెం	కార్యకర్త	ఎస్సీ
వాడచీపురుపలి	గొరుసువానిపాలెం	ఆయా	ఓసీ
దలాయిపాలెం		ఆయా	ఓసీ
వాడచీపురుపల్లి	నర్సాపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఓసీ
ముత్యాలమ్మపాలెం	దిబ్బపాలెం	ఆయా	ఓసీ
పెదముషిడివాడ	విజయరాంపురం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఓసీ
కలపాక	మరిసవానిపాలెం	మినీ అంగన్‌వాడీ కార్యకర్త	ఓసీ

ఆక్రమణల తొలగింపు


అసకపల్లి శివారు కుమ్మరికాలనీలో పొక్లెయిన్ సాయంతో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు పొక్లెయిన్ సాయంతో తొలగించారు. తహసీల్దార్ జె. చలమయ్య ఆదేశాల మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో జయశ్రీ సిబ్బందితో కలిసి అసకపల్లి శివారు ఎర్రవానిపాలెం సర్వే నెంబరు 1లో 3 షెడ్లను, నక్కవానిపాలెంలో ఒకటి, కుమ్మరి కాలనీలో ఒక పునాదిని తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలకు తెరతీశారన్నారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆక్రమణ దారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం

- మేయర్ గొలగాని హరివెంకట కుమారి
- 87వ వార్డులో రూ.50.70 లక్షలతో పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

కూర్మన్నపాలెం: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర పరిధిలో ఉన్న వివిధ పార్కులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ 87వ వార్డులోని అమరావతి మదర్ థెరిసా వాకర్స్ పార్కు, మహాత్మాగాంధీ పార్కు, తిరుమల నగర్‌లోని చిల్డ్రన్స్ పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందుతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విశాఖ నగరాన్ని ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేశామన్నారు. 87వ వార్డులో సుమారు 50.70 లక్షల వ్యయంతో పార్కులతో పాటు సీసీ డ్రైనేజీలు, కల్వర్టుల వంటి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేయించి, పార్కులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గాజువాకలో ప్రతీ వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, కార్పొరేటర్ బొండా జగన్నాథం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, గాజువాక మండలాధ్యక్షుడు బొడ్డ గోవింద్, జేసీఎస్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, నాగభూషణం, శివారెడ్డి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం హైస్కూల్‌ను సందర్శించిన ఎల్ఐపీ బృందం


ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న బృంద ప్రతినిధులు

అగనంపూడి: లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఈపీ) రాష్ట్ర బృందం గురువారం పరిశీలించింది. పాఠశాలలో ఎల్ఐపీ అమలు తీరును బృంద ప్రతినిధులు పరిశీలించారు. బోధనా విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 6 నుంచి 8 తరగతుల విద్యార్థులకు అమలు జరుగుతున్న ఎల్ఈపీ కార్యక్రమంపై అలక్ష్యం, అశ్రద్ధ వహించవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమ నిర్వహణపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. కార్యక్రమంలో బృంద ప్రతినిధులు వై.వెంకట్‌రెడ్డి, అనకాపల్లి జిల్లా ఎస్ఎస్ఏ అకడమిక్ మానిటరింగ్ అధికారి మురళీ మోహన్ పట్నాయక్, పరవాడ మండల విద్యాశాఖాధికారి దివాకర్ రావు, పాఠశాల హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా గాదాలమ్మ ఉత్సవం

పరవాడ: తానాం గ్రామంలో కొలువుదీరిన గాదాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం నేల డ్యాన్సులు, చిడతలు, భజనలు, తప్పెటగుళ్లు, డప్పువాయిద్యాలు, భారీ బాణసంచాకాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించి అనుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, గండి బాబ్జీ, పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కన్నూరు వెంకటరమణ, సర్పంచ్ కన్నూరి దేవి దర్శించుకున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి అనుమానాస్పద మృతి


మృతుడు ప్రసాదరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి గురువారం అనుమానాస్పదంగా మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ క్యూఏటీడీ విభాగంలో ఫోర్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న పరవాడ ప్రసాదరావు (45) టౌన్‌షిప్‌లో సెక్టార్-10 క్వార్టర్స్‌లో కుటుంబంతో నివసిస్తున్నారు. మధ్యాహ్నం స్థానిక కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న తమ పిల్లలను స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వచ్చారు. ఇంట్లోకి వెళ్లిన కొద్దిసేపటికి కుటుంబీకులు లోపల చూడగా అపస్మారక స్థితిలో కనిపించారు. వెంటనే ఉక్కు ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని మెడపై ఉన్న గాట్లను బట్టి మృతిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించనున్నామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఆరిలోవ: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సాగర్‌నగర్ దరి సుభాష్‌నగర్‌లో నేతాడ శ్రీను కుటుంబంతో నివాసముంటున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారుల్లో రెండో కుమారుడు కృష్ణ(28) కారు ఆప్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో నిత్యం పని ఉండదు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. సరిగా పనిలేకపోవడం, మద్యానికి కావల్సిన డబ్బులు చేతిలో లేకపోవడంతో ఆత్మహత్యకు పూనుకున్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'కార్మికులను దెబ్బ తీసేందుకే ప్రైవేటీకరణ'


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మిక శక్తిని పూర్తిగా దెబ్బ కొట్టాలనే ఆలోచనతోనే ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. ఉక్కు ఉత్పత్తిని నిలిపివేసి, ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడమే కాక సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని కుట్రలు పన్నుతోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1106వ రోజు, గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.